

# అనగనగా...కథలు

## – డా.శైలజ చందు



డియర్ రీడర్స్,

పేషంట్లు , హాస్పిటల్ గురించి కాకుండా ఎప్పుడైనా వేరే genre కథ వ్రాయాలని మనసు బలాటపడుతుంది.

దాని ఫలితమే ఈ నెల 'అనగనగా...కథలు'

చందు శైలజ

***

దశరథుడికి పెరోల్ వచ్చిందట.

అన్న కూతురి పెళ్లికొస్తున్నాడు.

ఊరు ఉలికి పడింది.

అతన్ని అందరూ , ఎప్పుడో మరిచిపోయారు.

పచ్చగా మెరిసే పొలాలు, పరుగులెత్తే పిల్ల కాలవలు, నిండుగా ఉన్న ఊరి చెరువు, రోజువారీ దిగుళ్లతో ఎక్కడికక్కడ బాగానే ఉన్నట్లనిపించింది. ప్రశాంతంగా గడిచిపోతోంది.

'ఇప్పుడెందుకొస్తున్నాడు. ఎందుకీ కొత్త సంకటం ' అనుకోకుండా ఉండలేకపోయారు ఊరి జనం .

నిశ్చింతగా కూర్చున్నది కౌసల్య మాత్రమే.

“ఎవరు పిలిపించారు? ఎవరిదంతా చేసింది?”

కౌసల్య గొంతులో కోపం లేదు.

"ఎందుకొస్తున్నాడు?" అక్క భర్తని అడిగింది.

ఆయనే ఏదో చేసి ఉంటాడని కౌసల్య అనుమానం.

“మరి కన్యాదానం ఎవురు చేస్తారే? ఆడే గందా! ఆడి అన్న కూతురు కూతురిపెళ్లికాడొస్తంటే వద్దనడానికి మనమెవరమే?” మరదలితో అరిచినట్టుగా అన్నాడు.

చేసినది సమర్థించుకోవడానికన్నట్టు గొంతు పెద్దది చేశాడు.

బావగారి మాటలకు కౌసల్య ఎదురు చెప్పలేదు.

***

బస్సు అతన్ని దింపేసి , ఎర్ర దుమ్ము రేపుకుంటూ వెళ్లిపోయింది. అది వెళ్లినంత సేపు దాని వంకే చూస్తూ నిలబడ్డాడు. అక్కడి నుండి ఊళ్లోకి నడవాలంటే కనీసం ఇరవై నిముషాలు పడుతుంది . కందిచేలల్లోంచి అడ్డదారిన వెళ్లొచ్చుగానీ, పొద్దు వాలుతున్నది. పురుగేదైనా ముడితే ప్రమాదమని రోడ్డు మీద నడిచి వెళుతున్నాడు. నడక అలవాటైతే అలుపు తెలియదు.

చెరువు పక్కగా నడుస్తున్నాడు. చింత చెట్టు నీడల్లో చెరువు తళ తళా మెరుస్తోంది. కొన్ని మోటారు సైకిళ్లు అతన్ని దాటిపోతున్నాయి.

ఎల్లుండి తెల్లవారుతూనే పెళ్లి.

‘పెళ్లి కాగానే వెళ్లిపోవాలి.’ అనుకున్నాడు.

‘ఎవరైనా గుర్తు పడతారా తనను?’

మినప చేలల్లో పనిచేస్తున్న కూలీలు ఒక్క క్షణం పని ఆపి , రోడ్డు మీద వెళ్తున్న కొత్తమనిషెవరో పోలుచుకోవడానికి చూశారు.

“ఎవరదీ? ఏవూరూ ?” అంటూ కేకేశారు.

“ఈ వూరే, మంగమ్మ గారి కొడుకుని.” ఆ మాట అతనికే వినిపించలేదు.

వాళ్ళు మళ్లా పనిలో పడిపోయారు.

తమ పొలం వద్ద నిలబడ్డాడు. పచ్చగా వరి పైరు పెరిగింది. సాయంకాలం గాలికి వయ్యారాలు పోతూ ఉంది. పక్కనే పిల్ల కాలువ అల్లరి చేస్తూ పరుగులు తీస్తోంది.

కాలవ పక్కనే ఓ చోట తుమ్మ చెట్టుని చూసి ఆగిపోయాడు. దాని కొమ్మలకు చిక్కుకుని గుడ్డ ముక్కలు ఉన్నాయి. నల్లవీ ,ఎర్రవీ! వాటిని చూస్తే పాత విషయాలేవో గుర్తొచ్చాయి.

సోమయ్య కొడుకుని కొట్టి తోసేసింది ఈ కాలవలోకే. బడిలో గొడవైంది. వచ్చే దారిలో వాడు నవ్వుకుంటూ వస్తుంటే, సైకిల్ మీద నుండి లాగి కింద దుమ్ములో పడేసి కొట్టాడు. ఈ చెట్టు మీదే పడ్డాడు. వాడి వంటికి తుమ్మ ముళ్లు గుచ్చుకున్నాయి. వాడి చొక్కా చిరిగిపోయింది. తోటి పిల్లలకు అడ్డుపడాలంటే భయమేసి దూరంగా నిలబడ్డారు. పొలాల్లో పనిచేస్తున్న కూలీలొచ్చి వాణ్ణి కాపాడారు.

కోపం తీరక, వాడి సైకిల్ ని కాలవలోకి నెట్టేశాడు.

ఇంటి మీదకు గొడవకొచ్చాడు వాడి నాన్న. పంచాయితీ లో పెద్దలతో చెప్పారు. తనతో బాటు రావడానికి తండ్రి లేడు.

తల్లితో కలిసి వెళ్లడం ఇంకా గుర్తుంది. క్షమించమని పంచాయితీ పెద్దలని తల్లి వేడుకోవడం తనకేమీ నచ్చలేదు. చెట్టుకు కట్టేసి దెబ్బలు కొట్టాలని తీర్పిచ్చారు పెద్దలు.

కట్టెయ్యడానికొచ్చిన లోకేశ్వర్రావు తన చూపుకే భయపడి తాడక్కడ పడేసివెళ్లిపోయాడు.

దశరథుడి కోపమంతా కళ్లలో ఉంటుందంటారు. ఎర్రటి కళ్లు. కోపం వస్తే, నిప్పు కణికల్లా ఉండేవి. అతని వైపు వెళ్లడానికి, మాట్లాడడానికి ఎవరికీ ధైర్యం లేదు.

దశరథుడు కూడా ఎవరినీ లెక్క చెయ్యడు, అన్న నారాయణని తప్ప.

పొలం నుండి రోడ్డెక్కి నడుస్తోంది నాంచారమ్మ.

కొంచం వెనగ్గా నెమ్మదిగా అడుగులేస్తున్నాడు దశరథుడు. వెలిసిపోయిన రంగు చీర కొంగు చుట్టలా చుట్టి , దానిమీద తట్ట పెట్టుకుని నడుస్తోంది. వయసయిపోయినట్టుంది. చేతులు నల్లటి ఇనప చువ్వల్లా ఉన్నాయి. చర్మం ఎండిపోయి ముడతలు పడింది. ఎర్రటి గాజు వేసుకుంది. గుప్పెడంత మనిషి. మనిషికి మించిన బరువు. చీర మోకాళ్ల పైకి ఎగకట్టింది. కాళ్లకు చెప్పుల్లేవు.

రాళ్లమీదే నడుస్తోంది. మనిషి వస్తున్న అలికిడి విని వెనక్కి తిరిగి చూసింది. తమ ఊరి మనిషేనా అన్న అనుమానంతో

“ఎవురింటికీ?” అని అడిగింది.

“పెళ్లింటికి.”

"కౌసల్య కూతురి పెళ్లికొస్తున్నావా?"

తలూపాడు.

దశరథుణ్ణని చెప్పలేకపోయాడు. ఓ నాడు నాంచారి మొగుడు రేడియో స్థంభం నీడ్ర గన్నేరు చెట్టు కింద నిలబడి తన గురించే మాట్టాడాడాని, చేతినున్న కర్రతో ముందూ వెనకా చూసుకోకుండా కొట్టాడు. పారిపోతున్న వాడిన లాక్కొచ్చి , రేడియో వినడానికి పోగైన మనుషుల ముందే కొట్టాడు.

కాలిరిగింది. ఆర్నెల్ల పాటు మంచం దిగలేదు. అన్నీ విసుగనుకోకుండా చేసింది నాంచారి. తనెదురు పడితే తప్పించుకుని పోయేది. కోపంలో ఉన్న ఆంబోతుకు ఎదురెళ్లడం ఎందుకనుకునేది.

తనే దశరథుణ్ణి అని చెప్తే?

ఆనాడు ఎదురుపడే తెగువ నాంచారికి లేదు. ఈనాడు తానే దశరథుణ్ణని చెప్పే ధైర్యం తనకు లేదు.

దశరథుడికి జ్ఞాపకాలన్నీ చుట్టుముడుతున్నాయి.

స్కూలు మానేసి తల్లితో బాటు వ్యవసాయంలోకి దిగాడు.

మనిషితో బాటు కోపమూ పెరిగింది. దాంతో గొడవలూ పెరిగాయి.

కాలవ నీళ్లు మళ్ళించారనో, తమకు రావలసిన కూలీలు పక్క పొలాల వాళ్లకెళ్లారనో, గట్ల మీద గడ్డి వేరే ఎవరో కోసుకెళ్లారనో, గొడవ లేని రోజుండేది కాదు.

ప్రశాంతంగా రోజు వెళ్లమారిపోవడమన్నది జరగదేమో అన్న బెంగ ఉండేది జనంలో.

గొడవ పెట్టుకోవాలన్న ఆలోచన అతనికున్నట్టుండేది కాదు. పరిస్థితులే అలా తోసుకొచ్చేవి. ఏ విషయంలోనైనా తగ్గడమన్నది చేతనయ్యేది కాదు. తను గొడవ పడి నెగ్గకపోతే , చవటలా లెక్కవేస్తారన్న భయమేదో అతన్ని తరుముతున్నట్టే ఉండేది.

న్యాయం తన వైపుండబట్టే తనకంత కోపం వస్తుందనుకునేవాడు

అన్నకు, అన్నకూతురికీ తప్ప వేరే ఎవరికీ లొంగే వాడు కాదు.

అన్న కూతురు అరుణంటే మమత.

అన్న నారాయణకు భార్య చనిపోయి నాలుగేళ్లవుతోంది. పదేళ్ల కూతురుంది. ఆ పిల్లని సవతి తల్లికి ఒప్పగించలేక పెళ్లి మాటెత్తకుండా ఉన్నాడు నారాయణ. తమ్ముడి వ్యవహారం వల్ల ఊరంతా పగ. దశరథుడుండే ఇంట్లో పిల్లనివ్వడానికెవరూ ముందుకు రాలేదు, అన్నకైనా , తమ్ముడికైనా.

తండ్రి ఇచ్చి వెళ్లిన అయిదెకరాల పొలాన్ని సాగు చేసుకుంటున్నారు.

దశరథుడి పెళ్లి కూడా విచిత్రంగా జరిగింది. మేనమావ కొడుకు పెళ్ళికి తమ పొలంలో అరటి గెలలివ్వడానికని వెళ్ళి, పెళ్లికొచ్చిన కౌసల్యని చూశాడు. పెళ్లాడతానన్నాడు. ఆ పిల్లకు తండ్రిలేదు. తల్లికి కన్నీరు పెట్టుకోవడం తప్ప వేరే ఏం తెలియదు. అక్కా బావలతో ఉంటోంది. వాళ్లకూ పెళ్ళి చేసే స్తోమత లేదు. అటు వంటి స్థితిలో కొద్దో గొప్పో పొలం ఉండి , ఇంటి పట్టునే ఉండగలిగే సంబంధం రావడం కౌసల్య అదృష్టమనే అనుకున్నారంతా.

దశరథుడికి కూడా ఊళ్లో పిల్లనిచ్చే అనువులేదని మేనమావక్కూడా తెలుసు. పెళ్లి అయితే, మనిషి కుదురవుతాడనుకున్నాడు.

ఆ పిల్ల అక్కా బావల్ని పిలిపించాడు.

పేర్లు కలిశాయన్నాడు. ఆ భగవంతుడే పెళ్లికొడుకుని పంపించాడని చెప్పాడు. వెంటనే తాంబూలాలిప్పించాడు. మూడు వారాల తర్వాత పెళ్లి అనుకున్నారు.

'దశరథుడెలాటి మనిషి.' అని ఊళ్లోకెళ్లి కనుక్కునే మగ అండ లేదు.

పెళ్లి నాడు దశరథుడి గురించి ఆమాటా ఈ మాటా పెళ్లిపందిర్లో పొక్కింది. పెళ్లికొడుక్కి వినపడేట్టుగానే,

ఊళ్లో పిల్లనిచ్చే గతిలేకపోబట్టే ఇలా పక్కూరికొచ్చి సంబంధం వెతుక్కున్నారన్నారు.

నివురు కప్పినట్టున్న కోపం రాజుకుంది.

ఆ అన్నవాణ్ణి పందిట్లోకి లాగి కొట్టాడు. ముక్కు నుండి రక్తం కారుతున్నా సరే ఆగ లేదు. అడ్డొచ్చినవాడినల్లా కొట్టాడు. క్షణాల్లో పెళ్లి పందిరంతా రణరంగం చేశాడు.

అన్న నారాయణ వచ్చి శాంతింప చేస్తేగానీ ఆగలేదు.

పెళ్లికొడుకుని వెనక వైపు చూసింది కౌసల్య. ఈ పెళ్లి తప్పితే బాగుండో, అయితే బాగుండో కూడా తెలియలేదామెకు. అతన్ని చూస్తే ఏ మాత్రం మోహం కలగలేదు.

పెళ్లికూతుళ్లందరికీ 'పెళ్ళి వద్దనో , కావాలనో' చెప్పే వీలుండదు.

ముహూర్తం దాటిపోయింది. అయినా గానీ తాళి కట్టించేశారు.

పెళ్లయాక మొదటి ఆషాఢం అయింది. శ్రావణ మాసం మంచిరోజు చూసి కౌసల్యని కాపురానికి తెచ్చారు. అప్పటికి మధ్యాహ్నం. అందరూ భోజనాలు చేసి అరుగుల మీద కూర్చుని ఉన్నారు. కౌసల్య కట్టుకున్న చీర , తీసుకొచ్చిన సారె గురించి వివరాలడుగుతూ అక్కడే గుమి గూడి ఉన్నారు అమ్మలక్కలు.

ఏవేవో నవ్వులు, మోటు సరసాలతో వీధి తుళ్ళిపడుతోంది. పొలం నుండి వచ్చాడు దశరథుడు.

పొడుగ్గా బలంగా ఉన్నాడు . రోజూ కట్టే నీరుకావి పంచెకాకుండా, తెల్లటి గ్లాస్కో పంచెలో ఉన్నాడు. రంగు చొక్కా వేశాడు. చొక్కా కింద బలమైన కండలు. కోర మీసం వేలితో నలుపుకుంటూ నిలబడ్డాడు. దృష్టి అంతా భార్య మీదే ఉంది. దశరథుడి ఎర్రని కళ్లలో జీరలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

భర్త మొహంలో ఆ గాండ్రింపేవిటో, ఆమెకు క్షణకాలం ఊపిరాడలేదు. భయాన్ని మించిన భావమేదో ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసింది. పులి చేతికి చిక్కిన జింక పిల్లలా కంగారు పడింది. చివాల్న లేచి నిలబడింది. వళ్లో ఉన్న సగం కట్టిన మాల , ముళ్ల గోరింటలు జలజలా అరుగుమీద పడ్డాయి. దారబ్బంతి, కింద పడి పరుగుతీస్తున్నట్టు దొర్లుతూ పోయింది. ఒక అడుగు పక్కకు వేసి ఇంటి లోపలికి పోబోయింది.

మెరుపులా కదిలాడు. గుప్పెడంత నడుముని చేతిలో చిక్కించుకున్నాడు. అందరూ తేరుకునే లోపున ఆమెను లేగ దూడలా భుజాన వేసుకుని లోపలికి నడుస్తూ కాలితే వెనక నుండే తలుపుని ధఢాలుమని మూశాడు.

చూసేవాళ్లంతా సిగ్గుతో తలదించుకుని ఏదో పని కల్పించుకుని ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. కౌసల్య అక్కా బావా నిర్ఘాంత పోయారు. అటువంటి విచిత్రమైన సన్నివేశం అదివరకెన్నడూ చూసి ఉండలేదు.

❦❦❦

జ్ఞాపకాలు నడిపిస్తూ ఉంటే , పెళ్లి ఇంటివరకూ వచ్చాడు దశరథుడు. ఇంటి ముందు పందిరేమీ లేదు.

రెండు నిముషాలు వాకిట్లో నిలబడ్డాక, బయటికి వచ్చిన కౌసల్య బావ , అతని వంక తేరిపార చూసి పోల్చుకున్నాడు.

"రారా, ఇదేనా రావడం. మజ్జేనం బస్సుకొచ్చావా?" అంటూ వాకిట్లో మంచం వాల్చి కూర్చోబెట్టాడు.

ఓ పక్కగా కారబ్బంతి పూల మడి ఉంది. పొద్దు వాలుతున్నా గాలి వేడిగానే ఉంది.

"ఏమేయ్, ఎవురొచ్చారో చూడు." అంటూ లోపలికి కేకేశాడు.

కౌసల్య అక్క వచ్చి వసారాలో నిలబడింది. మానుగాయి రంగు చీరకట్టుకున్నది. ఏదో పని చేస్తూ లేచి వచ్చినట్లుంది. చీర చెంగులు పైకి ఉండేసరికి బొద్దుగా ఉన్న కాళ్లు , బోలు కడియాలు కనిపిస్తున్నాయి.

"ఏంటే అట్టా సూస్తావు. మన దశరథుడే. నీళ్లట్టుకురా." అతనికేమైనా తినడానికి, తాగడానికి చూడమన్నట్టు చెప్పాడు.

ఆమెతో బాటే అయిదారుగురు ఆడవాళ్లొచ్చి నిలబడ్డారు.

ఆమె వెనకుండి చూస్తూ ఉన్నారు. దశరథుడు తలతిప్పి వదిన గారి వంక ఒక్క క్షణం చూశాడు. మరు క్షణంలోనే తలొంచుకుని కింద మొలిచిన గడ్డి వంక చూస్తూ ఉన్నాడు.

అరుణని చేసుకుంటానని వచ్చిన వాళ్లు, కలిగినవాళ్లని చెప్తున్నాడు తోడల్లుడు. సొంతగా మినపచేను వేశారట. పిల్లవాడు బాగా బుద్ధిమంతుడట.

"మన సంబంధం ఒప్పుకోవాల్సిన పనిలేదు. మన సంగతులేవీ తెలియవు. పిల్లని చూసి ఇష్టపడి ఒప్పుకున్నారు."

అంతా దాని అదృష్టమేనన్నాడు.

అతనిమాటల్లో , దశరథుడు తెలివితక్కువగా ప్రవర్తిస్తే సంబంధం చెడిపోతుందేమోనన్న ఆదుర్దా వినిపిస్తోంది.

మాటల మధ్యలో నిశ్శబ్దం ఉంటే అతనికేదో నచ్చినట్టు లేదు. ఎప్పటికప్పుడు ఏదో ఒక కబురు అవసరమైనదో , అనవసరమైనదో చెబుతూనే ఉన్నాడు తోడల్లుడు. దశరథుడికి కొన్ని వినిపిస్తున్నాయి. కొన్ని చెవికెక్కడం లేదు.

'ఎవరీ కొత్త మనిషి?' అని చూసేందుకు నలుగురైదుగురు పిల్లలు చుట్టూ చేరారు.

వాళ్లలో పెద్దగా ఉన్న ఒక ఆడపిల్లతో "పోయి అక్కని పిలుచుకురండి." అని కబురు పంపాడు.

పెళ్లి కూతుర్ని చెయ్యి పట్టి వచ్చారు పిల్లలంతా. ఆమెతో బాటే ఆడవాళ్ళు కూడా వచ్చి వాకిట్లో నిలబడ్డారు.

పెళ్లి కూతుర్ని చేసినట్టున్నారు. బుగ్గన చుక్క ఉంది. వంకాయ రంగు జిలుగు మెరుపుల చీర కట్టుకుంది. తప్పనిసరై వచ్చి నిలబడ్డట్టు నిలబడింది.

ఆ వచ్చిందెవరో ఆమెకు తెలుసో లేదో కూడా అర్థం కానంత నిరాసక్తంగా దిక్కులు చూస్తూ నిలబడింది. అయిదు నిముషాల తర్వాత ఆమెకు విసుగేసినట్టు,

"నే ఎళ్లనా పెదనాన్నా?" అని అడిగింది.

తోడల్లుడు, దశరథుడి మొహం వంక ఓ సారి చూసి "సరే, ఎళ్లు" అన్నాడు.

ఎప్పుడో చిన్నపిల్లగా చూశాడు.

తానెవరో గుర్తేనా ఈ బిడ్డకు.

చివరి సారి, తనని ఏ పరిస్థితిలో చూసిందో జ్ఞాపకం వచ్చింది.

తలదించుకున్నాడు.

దశరథుడి పెళ్లయిన కొన్నేళ్ల వరకూ గొడవలు తగ్గాయి. దశరథుడికింకా పిల్లలు కలగలేదు. వాళ్ల అయిదెకరాలికింకో రెండెకరాలు కలిశాయి. గిత్తని కొనేందుకోనాడు పొరుగూరికి సంత కెళ్లాడు. కోడె దూడని తోలుకొస్తున్నాడు.

పొలాల్లో ఆడకూలీలు పనులు ముగించుకుని రోడ్డెక్కారు.

దశరథుడితో ఉన్న కోడె దూడని చూసి ముచ్చట పడి తమలో తాము మాట్లాడుకున్నారు వాళ్లు.

రెండేళ్లాగితే ఎంత ఘనంగా తయారవుతుందో ఊహించి అబ్బురపడ్డారు.

ఎక్కడ కొన్నాడో, ధర ఎంత పెట్టాడో అడిగారు.

దశరథుడు సౌమ్యంగానే జవాబిస్తుంటే

"గిత్తకు ఏదన్నా పేరు పెట్టరా." ముసలామె ధైర్యం చేసి సలహా ఇచ్చింది.

'భద్రుడు, వీర భద్రుడు' అనుకున్నాడు మనసులోపల.

"సొర్గంలో ఇంద్రుడిలెక్కున్నది కోడె గిత్త." అన్నదొకామె.

భద్రుడి మూపు తడిమాడు. దశరథుడి కోడె దూడపై చూపిస్తున్న ఆప్యాయత చూసి

"పెళ్లయాక మారిపోయాడు పిల్లగాడు." అన్నదొకామె.

"ముక్కు తాడు పడిందిగా." నవ్వారంతా.

నిజమే , పొద్దెక్కితే అక్కడే ఉండిపోతాను ,మర్నాడొస్తానని కౌసల్యతో చెప్పాడు. దానికి దూరంగా ఉండలేక వచ్చేస్తున్నాడు. తనని చూసి కౌసల్య ఏమనుకుంటదో. ముసి ముసిగా రాబోయిన నవ్వుని బలవంతాన ఆపేశాడు.

కోడె దూడని చావిట్లోకి తీసుకెళ్లి మంచినీళ్ల గాబు దగ్గర నిలబెట్టాడు. అది తాగాక, కట్టుకొయ్యకు కట్టేసి పచ్చగడ్డి వేశాడు.

అప్పుడే పాలు తీయడానికి కడవతో వచ్చింది తల్లి.

సావిట్లో వెన్న కొండలా నిలబడ్డ భద్రుణ్ణి చూసి

'ఒరె ఒరె , ఎవర్రోయ్ కొత్త సుట్టం " అంటూ దగ్గరకెళ్లి ముద్దులాడింది అమాయకంగా నిలబడ్డ కోడెదూడని .

తల్లి చేతిలో పాల కడవ చూసి,

"ఇంత ఆలిసిమయ్యిందే పాలు తియ్యడానికి?" అడిగాడు.

"అనసూయమ్మ కూతురత్తగారింటికెల్తంటేనూ, అరిసెలొత్తడానికని ఎళ్లా."

"అదేం చేత్తందీ?" అంటూ ఇంటివైపెళ్లాడు.

తలుపులు మూసి ఉన్నాయి.

చీర కట్టుకుంటుందేమోనని నాలుగైదు నిముషాలాగాడు.

ఎంతకూ తెరవట్లేదని, తలుపు మీద కొట్టి, "ఏమేయ్" అని పిలిచాడు.

మర్నాడొస్తాడన్న భర్త ఆ సాయంత్రమే తిరిగి వచ్చాడు. భర్త తలుపు తలుపుకొడుతుంటే, లోపలున్న కౌసల్య ప్రాణాలు పైకెగిరిపోయాయి. స్పృహ తప్పేంత వేగంగా గుండె కొట్టుకుంది.

ఎంతకూ తియ్యదేమిటని తలుపులు దబదబా బాదుతున్నాడు దశరథుడు.

తలుపు తీసింది.

"సందెకాడ తలుపులు మూసుకున్నావేంటే? ఆడ అమ్మొక్కతే పనిచేస్తంటే!" అంటూ చేతికో చెర్నాకోల చూరులో దాచి, లోపలికడుగు పెట్టి ఆగిపోయాడు.

లోపల అన్న ఉన్నాడు. కానీ ఉండాల్సిన రీతిలో లేదు.

గుడ్డి వెలుతురులో చూసిన దృశ్యం మొదట మనసుకెక్కలేదు.

ముగ్గురూ ఒకరి మొహాలు ఒకరు చూసుకోలేనంత సిగ్గు పడే స్థితిలో మౌనంగా నిలబడ్డారు.

మొదట తేరుకున్నది దశరథుడే. అన్నని జుట్టు పట్టుకుని బయటకు లాక్కొచ్చాడు.

వీధిలో అరుగుల మీద పిల్లలకు అన్నాలు తినిపిస్తున్నా ఆడవాళ్లు కంగారు పడి లేచి నిలబడ్డారు. నారాయణ పరిస్థితి చూసిన ఆడవాళ్లు కళ్ళు మూసుకున్నారు. ఏదో గలాటా అవుతోందని అనుమానమొచ్చిన తల్లి చేతిలో పాలకడవతో సహా పరుగున వాకిట్లోకొచ్చింది. రెండో కొడుకు పరశురాముడిలా ఉన్నాడు.

పెద్దకొడుకు అవస్థ చూసి సిగ్గుతో చితికిపోయింది. పాల కడవ నేల జారిపోయిందెప్పుడో. దణ్ణెం మీద ఆరేసిన చీరలాగి కొడుకు మీద కప్పింది.

పెద్దకొడుకు మరదలితో సావాసంగా ఉంటున్నాడని అనుకుంది గానీ, ఆమెక్కూడా కొత్త సంగతి తెలిసింది.

దశరథుడి సంగతి తెలిసిన తల్లి నేల మీద కూలబడింది.

కన్నీళ్ళతో చేతులు జోడించింది.

"కడుపులో చిచ్చు పెట్టమాకురా అయ్యా. ఈ వయసులో నన్ను వెళ్లమారిపోనీ."

దశరథుడి కాళ్లు పట్టుకుంది.

నిలువెత్తు అగ్నిగుండంలా ఉన్నాడతను. ఆమెనెటో తోసేశాడు. చూస్తున్న వీధిలో ఆడవాళ్లంతా లోనికెళ్లి తలుపులు మూసుకున్నారు. ముసలయ్య తాత వీధిలోకి రాబోతూ వీరింటి ముందు జరుగుతున్న గలాభా దూరాన్నుండే చూసి వెనక్కి వెళ్లిపోయాడు.

"అయ్యా, తోడబుట్టిన వాణ్ణి దయజూడు" అంటూ కాళ్లా వేళ్లా పడుతోంది తల్లి. జరగబోయే ఘోరాన్ని ఆపాల్సిందే అన్నట్టు వదలకుండా అడ్డుపడుతోంది. తోసేస్తున్నా మళ్ళీ మళ్ళీ వచ్చి ప్రయత్నిస్తోంది. ఆగ్రహానికి అడ్డు పడుతోన్న ఆమెను "నువ్వు లేయే" అని అరిచాడు. ఆ అరుపుకు పరసరాలు ఉలికి పడ్డాయి. ప్రాణమున్న ప్రతి జీవీ స్థాణువై నిలిచింది. ప్రకృతి మొత్తం నిశ్శబ్దం తప్ప వేరే స్వభావం తెలియనంతగా స్థంభించింది.

ఆమెను లాగి విసిరేశాడు. ఏమూల పడిందో మళ్లీ రాలేదు.

అతడి చేతిలో దెబ్బలు తింటున్న అన్నకు, వేడుకోవడానికేమీ లేదన్నట్టు దెబ్బలన్నిటినీ మౌనంగా సహిస్తున్నాడు. పారిపోడానికి వీలున్నా నేలమీదే పడి ఉన్నాడు.

చూరులో ఉన్న వేట కత్తి తెచ్చాడు దశరథుడు.

“నేను చేసింది తప్పే. నన్నేమైనా చెయ్యి. ఆడదాన్నేమీ చెయ్యకు. నా బిడ్డని దిక్కులేనిదాన్ని చెయ్యొద్దురా.”

అన్న మాట విన్నాడు.

విన్న మరు క్షణమే, వాకిట్లోసందె ముగ్గు పడింది.

వెన్నెల్లో ఎర్రగా!

ట్యూషన్ కెళ్లి తిరిగి వస్తున్న అన్న కూతురు ముగ్గు వంకే చూస్తూ నిలబడింది.

అటునుండి అటే పోలీస్ స్టేషన్ కెళ్లి లొంగిపోవడం , ఎన్నో ఏళ్ల తర్వాత, మళ్లీ ఇదే ఊరికి రావడం.

నిట్టూర్చాడు.

పెళ్లికూతురు ఇంట్లోకి వెళ్లిపోయాక, తోడల్లుడిని అడిగాడు ‘ఇంకా పందిరి వెయ్యలేదేమని’.

షామియానా కోసమని సోమయ్య కొడుకుని పట్నం పంపారన్నారు . అనుకుంటుండగానే మాటల్లో వచ్చేశా డతను. ఆనాడు చాలా ముహూర్తాలున్నాయనీ, పల్లెటూరి వరకూ వచ్చి , షామియానాలేసే పని వాళ్ళెవరూ దొరకలేదన్న కబురు తెచ్చాడు. ఇంకా చీకటి పడలేదు.

‘మర్నాడు పెళ్ళయే సరికి ఎండెక్కుతుందికదా. భోజనాలెట్టా పెట్టాలో,

పందిరిలేకుండా పెళ్లి ఎట్టాగని’ ఆడాళ్లంతా నొచ్చుకున్నట్టు మాట్టాడుకుంటున్నారు.

కొడవలి ,బంధం అడిగి తీసుకుని చెరువు దగ్గర తాడిచెట్టెక్కాడు. చీకటి పడేలోపల పచ్చి తాటాకులన్నీ ఇంటి ముందు పోగు పడ్డాయి. పందిరి గుంజలు పాతడం, తాటాకులు నెయ్యడం అంతా అయే సరికి అర్థ రాత్రి దాటింది.

వంట ఏర్పాట్లన్నీ పక్కింటి జోగయ్యగారింటి సావిడిలో చేస్తున్నారు.

తెల్లవారు జామున మూడింటికే మంగళ వాయిద్యాలు మోగుతున్నాయి. అప్పటికి గాడిపొయ్యి తవ్వేశారు. వినాయకుడికి మొక్కుకుని పొయ్యి రాజేశారు.

వెంకట్రాముడు పొయ్యి మీద గుండిగ దించలేకపోతుంటే, దగ్గరకెళ్లి , పక్కకు తప్పుకోమన్నట్టు సైగ చేశాడు. మెడమీదున్న తుండుగుడ్డతో దింపేశాడు. పులిహోర తనే కలిపాడు.

ఎవరితోనూ ఒక్క మాటా మాట్టాడ లేదు.

పెద్ద వంటలన్నీ దగ్గరుండి చేశాడు.

బండపనులన్నీ చేస్తున్నా, ఎవరూ అతన్ని కలుపుకోవడం లేదు. ఊరి ప్రశాంతత చెడగొట్టడానికొచ్చాడన్న కోపంతో ఉడికిపోతున్నారు జనం.

ఊరు ఊరంతా గట్టిగా జట్టు కట్టింది. దశరథుడు గొడవ చేస్తే, ‘వాడి తుప్పు ఇక్కడే రాలగొట్టేసి పంపిద్దాం. సి ఐ గారికి చెప్పి కేసు గట్టిగా బనాయిద్దాం. మళ్లీ ఊళ్లోకి రానీయకుండా చెయ్యాలన్న’ పట్టుదలమీద ఉన్నారు జనం.

నువ్వెవరో మాకు తెలియదన్నట్లు వాళ్లలో వాళ్లే పరాచికాలాడుకుంటున్నారు. ఒకప్పుడు అతని దగ్గర నోరెత్త లేని వారంతా మిడిసి పడుతూ మాట్టాడుతున్నారు.

తెల్లవారుతుండగానే మూహూర్తం. పెళ్లికొడుకు కాళ్లు శ్రద్ధగా కడిగి దశరథుడు. నీళ్లు నెత్తిన జల్లుకున్నాడు. పురోహితుడు చెప్పినవన్నీ చెప్పినట్టు చేశాడు.

పక్కన కౌసల్య కూర్చున్నా ఒకరికొకరు పట్టనట్టే మొక్కుబడిగా కూర్చున్నారు. ఒకరినొకరు చూడాలనో , పలకరించాలనో ఇద్దరికీ అనిపించలేదు. పెళ్లి అయ్యాక అందరూ భోజనాలు జరిగే సావిట్లోకి వెళ్ళిపోయారు.

అప్పగింతల పాట పాడేందుకు కొంతమంది ఆడవాళ్ళు, దగ్గర బంధువులు మాత్రం నిలబడ్డారు.

పెళ్లికొడుకునీ, పెళ్లి కూతురునీ ఎదురుగా కూర్చోబెట్టారు. ఒక ముత్తైదువ అప్పగింత పాట అందుకుంది. ఆ పాట పాడే మనిషిక్కూడా గొంతు జీర బోతోంది. ఎంత అణుచుకున్నా ఆగని ఉద్వేగం ఆమెను లోబరుచుకుంటోంది. ఆ పాటలో పదాలు వింటుంటే, సంబంధం లేని వారిక్కూడా కన్నీరుబికి వస్తోంది. అన్నకూతురి చేతులు పాలలో ముంచి పెళ్లికొడుకు చేతుల్లో రాస్తుంటే దశరథుడికి గుండె చెదిరింది. కన్నీళ్ళాపుకున్నాడు. ఎర్రని కళ్లలో నీళ్లు రాబోతుంటే లేచి వచ్చేశాడు.

తతంగమంతా అయే వరకూ కౌసల్యే కూర్చుంది.

సావిట్లోకి వచ్చాడు. పెళ్లికి కట్టుకున్న పంచె, లాల్చీ తీసి మామూలు బట్టలు వేసుకున్నాడు. తన సంచీ తీసుకుని కదలబోతుంటే తోడల్లుడు వచ్చాడు.

“ఏరా, రెండ్రోజులుండవూ?” అడిగాడు

“ఎళ్లాలిలే , ఎళ్తా!” నేల మీద కాలితో రాస్తూ అన్నాడు.

“భోజనం చెయ్యకుండా పోతావా?”

“వంటచేసేప్పుడు రుచి చూస్తానే ఉండా. పెద్దగా ఆకల్లేదు.” అంటూ పాంట్ జేబు లోంచి ఒక పాలిథీన్ పాకెట్ తీసి ఇచ్చాడు .

“ఏంట్రా?”

జైల్లో పనిచేసి సంపాదించిన డబ్బది. ఆమాట చెప్పకుండా, “అరుణకివ్వు.” అన్నాడు.

ఇంతలో కౌసల్య అక్క కూడా వచ్చి నిలబడింది.

"భోంచేసి ఎల్లయ్యా.” మర్యాదగా అన్నది మరిదితో.

వద్దన్నట్టు తలూపాడు.

పందిట్లో అందరి మధ్యా కూర్చోడానికి ఇబ్బందని తెలిసి, “నువ్వు పులిహోర, అదీ పొట్లాం కట్టి తీసుకురాయే” అని పురమాయించాడు తోడల్లుడు.

ఆమె లోపలికి వెళ్ళి ఏవేవో పొట్లాలు తెచ్చిచ్చింది.

“జాగర్తగా వెళ్లిరా. సంతోసంగా ఉండరా. అప్పుడప్పుడు ఓ ఉత్తరం రాస్తా ఉండు. మనసులో ఏం పెట్టుకోబాక” దశరథుడి భుజం పట్టుకుని, రెండో చేత్తో గుండె మీద రాస్తూ అన్నాడు. ఎక్కువ సేపు నిలబడే వ్యవధి లేదాయనకు. పెళ్ళి హడావుడి చూసుకునేందుకు వెళ్లిపోయారు.

వాళ్లిద్దరూ వెళ్లిపోయాక సావిట్లో పశువులన్నిటినీ ఓ మారు చూశాడు. పశువులన్నిటికీ గడ్డి వేశాడు.

తను కొన్న రోజునే వదిలేసిన కోడె దూడ భద్రుణ్ణి పోల్చుకున్నాడు.

ఎదిగొచ్చిన కొడుకులా ఉన్నాడు భద్రుడు. నల్లటి మూపురం. కళ్లలో పొగరు, నిర్లక్ష్యం. భద్రుడికి పచ్చగడ్డి వేశాడు.

మెడకింద చెయ్యి పెట్టి తడమ బోయాడు. ముట్టుకోబోతే ,కొమ్ము విసిరేస్తున్నాడు భద్రుడు.

తనెవరో తెలియదని ఏడుపొచ్చింది. 'నన్ను గుర్తు పట్టవా?' అన్నట్టు అలానే ఎదురుగా నిలబడ్డాడు చాలా సేపటి వరకూ.

కొద్ది సేపటి తర్వాత వదినగారిచ్చిన పొట్లాం నుండి అరిసెలు తీసి తినిపిస్తే , తింటూ తింటూ దశరథుడి చెయ్యి నాకాడు. ఇంకా కావాలన్నట్టు చూస్తుంటే,

'వద్దయ్యా, వాతం చేస్తుందని' పెరుగు అన్నం తినిపించాడు.

దశరథుడి చేతికంటిన అరిసెల వాసనకు అతని చేతుల్ని ఇంకా, ఇంకా నాకేస్తున్నాడు భద్రుడు. ఆమాత్రానికే సంతోషమయ్యింది. దాని మెడ వాటేసుకున్నాడు. మూపురం సవరించాడు.

"వెళ్లొస్తా నాన్నా." చెప్పాడు.

వెళ్లలేక గుంజకానుకుని కింద మునిగాళ్లమీద కూర్చుని కన్నీరు పెట్టుకున్నాడు.

అప్పగింతల పాట గుర్తొచ్చింది.

వెక్కి వెక్కి ఏడ్చాడు.

మనుషుల ఏడుపు కర్థం తెలియని పశువులెటో చూస్తున్నాయి.

***(వచ్చే నెల మరో కథతో కలుసుకుందాం)***

Post your comments